# సింగిల్ పేజీ కథలు

కాలేజీ వదిలిన తర్వాత స్నేహితులకి బై చెప్పి, సంజీవయ్య పార్కు చేరుకుంది రాధిక. ఓసారి అటూ ఇటూ రోడ్డు చివరకంటా చూసి, లోనికి అడుగుపెట్టింది.

పార్కంతా కలియజూసినా ప్రదీప్ జాడ కనిపించలేదు. అతడే వస్తాడులే అనుకుంటూ ఒకచోట కూర్చుంది. ప్రదీప్ ఆమెతో పాటే డిగ్రీ చదువుతున్నాడు. కొద్దిసేపటికి "హాయ్ రాధికా" అంటూ వచ్చాడు. అతడి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. రాధిక నవ్వింది. "నేను కాదంటే ప్రాణం తీసుకొనేంత గాఢంగా నన్ను ప్రేమిస్తున్నావా?" అడిగింది.

"హండ్రెడ్ పర్సెంట్" షార్ప్‌గా బదులిచ్చాడు.

"నా ప్రేమను అంగీకరించినట్టేగా.." సందేహం తీరక అడిగాడు.

"ఊ" అన్నట్టుగా కళ్లార్పి లేచింది రాధిక. "రేపు ఫిల్మ్‌సిటీకి వెళదామా" అడిగింది రాధిక.

"ఫిల్మ్‌సిటీకా.." గుటకలు మింగాడు ప్రదీప్.

"ప్రేమికులకు పార్కులు అంత 'సేఫ్ జోన్' కాదు. ఇలాంటి చోట మనకు తెలిసినవాళ్లు తారసపడే అవకాశం ఎక్కువ. ఇంట్లో తెలియడం, ఆపై గొడవలు.. ఎందుకొచ్చిన తంటా" అంది రాధిక.

రాధిక 'ముందుచూపు'కి ప్రదీప్‌కి ముచ్చటేసింది. 'ఎంత లేదన్నా ఏడెనిమిది వందలు ఖర్చవుతాయే, ఎలా' అనుకుని, చివరికి "సరే" అన్నాడు ప్రదీప్.

* * *

మరునటిరోజు రాధికను తీసుకుని ఫిల్మ్‌సిటీ చేరుకున్నాడు ప్రదీప్. చెరి రెండు వందల యాభై చొప్పున ఐదు వందలు పెట్టి రెండు టికెట్లు తీసుకున్నాడు. ఎప్పుడూ ఒక్కసారిగా తనకోసం కూడా అంత ఖర్చు పెట్టుకోని ప్రదీప్‌కి గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది. అంతలోనే 'ఛ..ప్రేమకి వెధవది డబ్బు అడ్డమేమిటి?' అనుకుని తేలికపడ్డాడు.

ఫిల్మ్‌సిటీలో అడుగుపెట్టింది మొదలు రాధిక నవ్వుతూ తుళ్లుతూ పసిపిల్లలా కేరింతలు కొడుతూ తిరగసాగింది. ఆమె వెనుక పడటం ప్రదీప్ వంతయింది. ఆమె స్థిమితంగా కూర్చున్నది లేదు. ఆమెతో సరదాగా కబుర్లు చెప్పాలన్న ప్రదీప్ కోరిక నీరుకారిపోయింది. అసలామెకు ఆమెవెంట తనొకడు ఉన్నాడనే స్పృహే ఉన్నట్టు కనిపించలేదు.

నానా తిప్పలూ పడి అప్పు సంపాదించి వేయి రూపాయలు ఖర్చు పెడితే, వేయి సెకన్లు కూడా ఆమెతో ఏకాంతంగా గడపలేకపోయానే అని బాధతో తిరుగుముఖం పట్టాడు.

* * *

"ఏమిటే... తల్లిదండ్రులు బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి కాలేజీకి పంపేది చదువుకోవడానికిగానీ, ప్రేమా దోమా అంటూ పార్కుల వెంట తిరగడానిక్కాదు అని తెగ ఉపన్యాసాలు ఇచ్చేదానివి. అలాంటిది ఇప్పుడేమిటి ఆ ప్రదీప్‌గాడితో..." నిలదీశారు మిత్రబృందం.

సరిగ్గా అదే సమయానికి ప్రదీప్ వచ్చాడు. రాధిక అతడిని పలకరించగానే మిగతా మిత్రబృందం కూడా వరుసగా 'హాయ్' అంటూ పలకరించారు.

"రేపు ప్రదీప్ మీ అందరికీ చిన్న ట్రీట్ ఇస్తాడు. పిజ్జా, బర్గర్, ఐస్‌క్రీమ్, ఎవరికి ఏం కావాలో మీ ఇష్టం" అంది రాధిక.

## అమ్మాయి ఐడియా

"ఓహో మమ్మల్ని ఈ రకంగా కూల్ చేయదల్చుకున్నావన్నమాట. సరే కానీ.." అన్నారు మిత్రబృందం.

'ఎంతలేదన్నా ఈ పదిమందికీ వేయి రూపాయలకు తక్కువ కాదు. మళ్లీ వేయి రూపాయల కోసం వేటలో పడాలి. లేదంటే తన మిత్రబృందం ముందు రాధిక మాట పోతుంది. ఖర్చుకి వెనకాడితే తనమీద రాధికకి ఇంప్రెషన్ పోతుంది' అనుకుంటూ నీరసంగా క్లాస్‌రూం వైపు నడిచాడు ప్రదీప్.

* * *

రెండు రోజులు గడిచాయి.

కాలేజీ వదిలిన తర్వాత మిత్రబృందానికి గుడ్‌బై చెప్పేసి, ప్రదీప్‌ని కలుసుకుంది రాధిక. ఇద్దరూ మాట్లాడుకుంటూ, బస్టాపు వరకు వచ్చారు.

"రేపు ఓషన్ పార్క్‌కి వెళ్దామా" అడిగింది రాధిక.

ఈలోగా బస్సు రావడంతో "ఓకే. రేపు కలుద్దాం" అంటూ బస్సెక్కేసింది రాధిక అతడి జవాబు కోసం చూడకుండా.

'డబ్బు ఎలా పుట్టించాలా' అని ఆలోచించుకుంటూ, ఇంటిదారి పట్టాడు ప్రదీప్.

* * *

ఓషన్ పార్క్‌లో కూడా ప్రదీప్‌కి ఫిల్మ్‌సిటీ అనుభవమే ఎదురయింది. ఎంట్రెన్స్ దగ్గర టిక్కెట్లు తీసుకొనేవరకే తన పని. ఆ పైన తనతో నిమిత్తం లేనట్టు తన లోకంలో తనుంది. చిన్నపిల్లలా చిందులు వేస్తూ ఓషన్ పార్క్‌లో ప్రతి అణువు కలతిరిగింది. ప్రేక్షకుడిలా చూడటం మినహా ఏం చేయలేకపోయాడు ప్రదీప్.

రాధిక తన ప్రపోజల్‌కి ఒప్పుకుని వారం రోజులే అయింది. ఈ వారం రోజులలో ఆమె కారణంగా మూడు వేలు అప్పయింది. ఖర్చయింది.

ఈ రోజుల్లో అమ్మాయిలు చాలావరకు బాయ్‌ఫ్రెండ్స్‌ని మెయిన్‌టైన్ చేసేది, ఖర్చుతో కూడుకున్న తమ సరదాలను, విలాసాలను బాయ్‌ఫ్రెండ్ ద్వారా తీర్చుకోవడానికి మాత్రమే అని చాలామంది అనగా విన్నాడు.

రాధిక వరస చూస్తుంటే అది నిజమేననిపిస్తోంది. తన సరదాలు తీర్చుకోవడానికి తనొక పనిముట్టుగా ఉపయోగించుకుంటోందని ఓషన్ పార్కు సందర్శనతో నిర్ధారణ కొచ్చేశాడు.

* * *

మరునటిరోజు- కాలేజీలో రాధికను అల్లంత దూరంలో చూసి మొహం తిప్పుకుని ఎటో చూస్తూ వెళ్లిపోబోయాడు. కానీ రాధిక చూడనే చూసింది. "హాయ్ ప్రదీ.." అంటూ పిల్చింది.

తప్పించుకునే ఛాన్స్‌లేదు. అప్పటికే ఓ కృతనిశ్చయానికి వచ్చి ఉండటం వల్ల ధైర్యంగానే ఆమెకేసి నడిచాడు.

"రేపు సెలవు కదా! 'మౌంట్ ఒపేరా'కి ప్లాన్ చేశాను. ఉదయమే స్టేషన్ దగ్గర కలుద్దాం ఏం?" అంది రాధిక.

"సారీ! పరీక్షలు దగ్గరపడుతున్నాయి. నేను చదువుకోవాలి. ప్రేమా దోమా అంటూ తిరిగితే పరీక్షలు గోవిందా అవుతాయి" అన్నాడు.

"అదేమిటి నాకోసం ప్రాణాలే తీసుకుంటానన్నవాడివి. ఇప్పుడు పరీక్షలే ముఖ్యమైనట్టు మాట్లాడుతున్నావు. చిత్రంగా ఉంది" అంది.

"నిజమే అది ఒకప్పుడు. నీలాంటి గర్ల్‌ఫ్రెండ్‌ని భరించగల ఆర్థిక స్థోమతు నాకు లేదు. నన్నొదిలేయ్" అంటూ చేతిలోని పుస్తకాలు వదిలి రెండు చేతులూ జోడించి చప్పున వెనుదిరిగి వెళ్లిపోయాడు.

రాధిక స్నేహితురాళ్లు అవాక్కయ్యారు ప్రదీప్ మాటలకు, ప్రవర్తనకు. రాధిక మాత్రం మౌనంగా ఉండిపోయింది.

"బుద్ధిలేదు నీకు. ఐనా వాడిని నువ్వు ప్రేమించడమేమిటి? వాడి మొహానికి నీలాంటిది ప్రేమించడం ఎంతో గొప్ప. అలాంటిది చూడు ఎలా దులపరించుకుని వెళ్లిపోయాడో" అన్నారు మిత్రబృందం.

రాధిక నవ్వింది హాయిగా.

"మరీ అంతగా ఫీలవ్వకండి. మీరంతా అనుకుంటున్నట్టు నేను అతణ్ని ప్రేమించలేదు. చదువుకునే వయసులో చదువే ధ్యేయం కావాలి. ప్రేమా దోమా అంటూ కెరీర్ పాడు చేసుకోవడం తెలివైనవాళ్లు చేసే పనికాదు. ప్రేమిస్తావా? చావమంటావా? అని ప్రదీప్ డెడ్‌లైన్ విధించాడు. అతణ్ని అలా వదిలేస్తే ప్రాణం తీసుకోవడమో, లేక మరో మనోహర్‌లా మారి ప్రాణం తీయడమో చేస్తాడు. అది ఇద్దరికీ శ్రేయస్కరం కాదు. అందుకే కాస్త తెలివిగా వ్యవహరించి అతన్ని ప్రేమిస్తున్నట్టు నటించాను. ఏ మగాడైనా ప్రేమ పేరుతో తనని వాడుకోవాలని చూసే అమ్మాయిని ఎంత మాత్రం కోరుకోడు. చూశారుగా ఎంతగా నా వెనకపడ్డాడో, ఇప్పుడంతగా వెనక్కి తగ్గిపోయాడు. నాక్కావల్సిందదే" అంది అసలు విషయం చెపుతూ.

తెలివిగా ప్రదీప్‌ని వదిలించుకున్న రాధికను మనసారా అభినందించారు మిత్రబృందం.

-జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె